మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్‌దే విజయం..!

**కాంగ్రెస్, బిజెపి సర్వేల్లోనూ 100 శాతం అధికారం బిఆర్ఎస్‌దే అని తేలుతుంది**
**తెలంగాణ రాకుంటే ఈ సంక్షేమ పథకాలు అమలయ్యేవా**
**బిజెపి నాయకులు వేరే రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలను కొనవచ్చు కానీ తెలంగాణలో సాధ్యంకాదు**
**మహబూబ్‌నగర్‌లో ఇప్పటివరకు జరిగింది 20 శాతం**
**అభివృద్ధి మాత్రమే 80 శాతం సినిమా ఇంకా ముందుంది**
**మహబూబ్‌నగర్ ప్లీనరీలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** కాంగ్రెస్, బిజెపి సర్వేల్లోనూ 100 శాతం అధికారం బిఆర్ఎస్‌దే అని తేలుతుందని కనీసం ఒకటో రెండో సీట్లైనా వస్తాయనే ఉద్దేశంతో ఆ పార్టీలు డాంబికాలు పలుకుతాయని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఏనుగొండలోని జెజెఆర్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి ప్రతినిధుల సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన ప్రతినిధుల సభకు ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. అమరవీరుల స్థూపానికి జోహార్లు పలికి తెలంగాణ తల్లికి పూలమాలలు వేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాకుంటే వ్యవసాయానికి ఉచిత నిరంతర విద్యుత్, రైతుబంధు, రైతుభీమా,ఆసరా పింఛన్లు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ తదితర సంక్షేమ పథకాలు అమలయ్యేవా అని మంత్రి ప్రశ్నించారు. తెలంగాణలో ఉన్న ఈ పథకాలు పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రంలో ఉన్నాయా బిజెపి, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఉన్నాయా అని మంత్రి ప్రశ్నించారు. 70 ఏళ్లుగా పరిపాలించిన వారు కనీసం తాగునీరు ఎందుకు ఇవ్వలేకపోయారని, 14 రోజులకోసారి తాగునీళ్లు వచ్చే దుస్థితి ఎందుకు ఉండేదని మంత్రి ప్రశ్నించారు. కనీసం మంచినీళ్లు ఇవ్వలేని పరిస్థితులు ఉన్నప్పుడు వ్యాపార వాణిజ్య రంగాలు ఎలా అభివృద్ధి చెందుతాయని, పరిశ్రమలు ఎలా వస్తాయని ఆయన ప్రశ్నించారు.


ప్లీనరీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి


అమరవీరుల స్థూపం దగ్గర నివాళి అర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్


సమావేశానికి హాజరైన మహిళలు

**బిజెపి నాయకులు వేరే రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలను కొనవచ్చు కానీ తెలంగాణలో సాధ్యం కాదు...**

బిజెపి నాయకులు వేరే రాష్ట్రాల్లో అక్కడ ఎమ్మెల్యేలను కొనవచ్చు గాని తెలంగాణలో మాత్రం సాధ్యం కాదని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఇక్కడ సీఎం కెసిఆర్ ఉన్నారని, ఆయనతో బిజెపి పప్పులు ఉడకవని పేర్కొన్నారు. ఎంతో కష్టపడి పదివేల కోట్ల పెట్టుబడులను పెట్టే పరిశ్రమ తీసుకువచ్చి సుమారు పదివేల మందికిపైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కృషి చేస్తుంటే కొందరు దుర్మార్గులు కుట్రలు చేసి అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి వారిని చూస్తుంటే ఎంతో ఆవేదన కలుగుతుందన్నారు. అందరికి ఉద్యోగ, ఉపాధ్యాయ అవకాశాలు కల్పించడం సాగునీటిని తీసుకువచ్చి అన్నదాతకు అండగా నిలబడడం, పర్యాటక ఆకర్షణలతో అభివృద్ధి చేయడం తమ ధ్యేయమన్నారు.

**మహబూబ్‌నగర్‌లో జరిగింది 20శాతం అభివృద్ధి మాత్రమే 80శాతం సినిమా ఇంకా ముందుంది...**

మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో ఇప్పుడు జరిగిన అభివృద్ధి కేవలం 20 శాతం మాత్రమేనని భవిష్యత్తులో 80శాతం సినిమా ఇంకా మిగిలే ఉందని మంత్రి తెలిపారు. ఎవరూ -మిగతా2లో..

# బిఆర్ఎస్ పార్టీకి నాయకులు, కార్యకర్తలే బలం, బలగం

**నారాయణపేట ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి**

**నారాయణపేట ప్రతినిధి,ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ జెండాను ఎగరేసి తెలంగాణ తల్లికి పూలమాల వేసి అమరవీరుల స్థూపం అమరులకు జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి నివాళులర్పించారు. అనంతరం ప్రతినిధుల సభలో పాల్గొన్నారు.వీరితోపాటు ఎంపి మన్నె శ్రీనివాస రెడ్డి,నియోజకవర్గ సమన్వయకర్త ఎస్. రవిందం రెడ్డిలు ఉన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్క కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం సీఎం కెసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించాలని, చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకెళ్లాలని కోరారు. మనం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రతి ఒక్కరికి వివరించాలని కొందరు 20 ఏళ్ల పాలనను నాలుగేళ్ల పాలనతో పోల్చినప్పుడే మనం అభివృద్ధిలో ముందున్నామని తెలుస్తుంది. నాలుగేళ్ల పాలన కాలంలో రెండేళ్లు కరోనాతో ఎన్నో ఇబ్బందులు పడ్డామని, కరోనా కష్టకాలంలో కూడ కన్నెత్తి చూడని వాళ్లు ఈరోజు ఏవేవో మాట్లాడుతున్నారని అన్నారు. 60 ఏళ్లనుంచి వెనుకబడిన నారాయణపేట జిల్లాను నేడు ఏ విధంగా ఉందో ఒక్కసారి చూడాలని అన్నారు. ముఖ్యమంత్రి వారి తనయుడు కెటిఆర్ సహాయ సహకారాలతో నారాయణపేట జిల్లాను అన్ని హంగులతో తీర్చిదిద్దడం కొరకు నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు.గ్రామ గ్రామాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు అందాయా లేదా ఒక్కసారి ఆలోచించాలని ప్రతి కార్యకర్త ప్రభుత్వ ఫలాలు అందుతున్నాయా అని నిర్భయంగా ప్రచారం చేయాలని అన్నారు. ప్రజల ఆశీస్సులు మనకు ఎల్లప్పుడూ ఉంటాయని కాబట్టి ప్రతి కార్యకర్త సైనికుడు వలే రాబోయే ఎన్నికల్లో పనిచేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

# పేదలకు వైద్య సేవలపై దృష్టి కేంద్రీకరించాలి..

**సంవత్సరంలోగా అన్ని హంగులతో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో**
**సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పూర్తి చేస్తాం: రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** ప్రజల డబ్బుతో చదువుకుంటున్న వైద్య విద్యార్థులు ప్రజల రుణం తీర్చుకునే విధంగా పని చేయాలని,ముఖ్యంగా పేదప్రజలు ఎక్కువగా ఉండే గ్రామీణప్రాంతాలలో వైద్యసేవలు అందించాలని, మానవ సేవే మాధవసేవగా పని చేస్తే వారి వైద్యవృత్తికి సార్థకత లభిస్తుందని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మహబూబ్‌నగర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో సుమారు రూ.3కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు.రెండు కోట్ల 45లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన కళాశాల ప్రహరీని ప్రారంభించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని, రెండు బస్సులను సైతం ప్రారంభించారు. ప్రభుత్వ వైద్య కళాశాల ఆధ్వర్యంలో సిపిఆర్‌పై ఏర్పాటు చేసిన కేంద్రంలో సిపిఆర్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. అంతేకాక మంత్రి స్వయంగా సిపిఆర్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఏర్పాటైన మొదటి వైద్య కళాశాల మహబూబ్‌నగర్ అన్నారు. కళాశాల ఏర్పాటైన 3 సంవత్సరాల్లోనే పిజి సీట్లు సైతం వచ్చాయని తెలిపారు. ఉస్మానియా, గాంధీ మెడికల్ కళాశాల తర్వాత స్థానంలో నాణ్యత విషయంలో మహబూబ్‌నగర్ ప్రభుత్వ వైద్య కళాశాల ఉంటుందని ఆయన తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో పేదవారు ఎక్కువగా నివసించే చోట వైద్య సేవలను అందించాలని, మానవతా దృక్పథంతో పని చేయాలని, అవసరమైతేనే ఆపరేషన్ల వంటివి నిర్వహించాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి స్థాయిని పెంచడంతో పాటు మరో ప్రభుత్వ ఆసుపత్రి కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రిని కోరిన వెంటనే 500 కోట్ల రూపాయలతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మంజూరు చేశారని, ఇక్కడ అన్ని రకాల జబ్బులకు చికిత్స అందించడంతో పాటు, క్యాంటీన్, డాక్టర్లు, సిబ్బందికి క్వార్టర్స్ అన్ని హంగులతో సంవత్సరంలోపు దీనిని ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి స్పష్టం చేశారు. మెడికల్ కళాశాల డైరెక్టర్ డా. రమేష్, మాజీ డైరెక్టర్ పుట్ట శ్రీనివాస్, ప్రభుత్వ ప్రధానాసుపత్రి సూపరింటెండెంట్ డా. రాంకిషన్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ నవకళ్యాణి, డా.జీవన్, మెడికల్ కళాశాల డాక్టర్లు కిరణ్, నావల్ కిశోర్, రాధారాణి తదితరులు ఉన్నారు.


సిపిఆర్ విధానాన్ని పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



**బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అభివృద్ధి శూన్యం..**
**9ఏళ్లలో జరిగిన తెలంగాణ**
**అభివృద్ధి ఇతర రాష్ట్రాలకు ఆదర్శం..**
**కేసీఆర్ అభివృద్ధి గురించి మాట్లాడితే.. అమిత్ షా జైలు,**
**కేసులు, నిర్బంధాల గురించి మాట్లాడుతారు...**
**త్వరలోనే మంత్రి కేటీఆర్‌తో పలు అభివృద్ధి**
**పనులకు శంకుస్థాపనలు..భారీ బహిరంగ సభ..**
**మహారాష్ట్రలోని ఔరంగబాదులో కేసీఆర్**
**పర్యటన భారీగా విజయవంతం అయింది..**
**అక్కడ స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుంది..**
**బీఆర్ఎస్ ప్రతినిధుల సమావేశంలో**
**రాష్ట్ర వ్యసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి..**

# ప్రతిపక్షాలుగా ఆత్మలేని పార్టీలు..!

**వనపర్తి ప్రతినిధి,ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** దేశం తిరోగమనం వైపు వెళ్లాలా..?ఆధునిక ప్రపంచంతో పోటీ పడి పురోగమనం వైపు వెళ్లాలా అన్నది దేశప్రజల ముందు ఉన్న పెద్ద సందేహం అని తెలంగాణలో ఆత్మలేని పార్టీలు ఇక్కడ ప్రతిపక్షాలుగా ఉండడం సిగ్గుచేటని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని లక్ష్మీకృష్ణ గార్డెన్ లో బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరై బీఆర్ఎస్‌జెండాను ఎగురవేసి అమరవీరుల స్థూపానికి నివాళి అర్పించారు.ఈసందర్భంగా మంత్రి నిరంజన్‌రెడ్డి కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అభివృద్ధి శూన్యమని తెలంగాణలో జరుగుతున్న అబివృద్ధి బీజేపీ పాలిత రాష్ట్రాలో జరగడం లేదని తెలంగాణ అభివృద్ధి యావత్ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. 9ఏళ్లలో జరిగిన అభివృద్ధి ఇతర రాష్ట్రాలకు ఆదర్శమన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మహారాష్ట్రలోని ఔరంగబాదులో నిర్వహించిన భారీ బహిరంగ సభలో అభివృద్ధి గురించి మాట్లాడితే..చేవెళ్లలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు అమిత్ షా హాజరై జైలు, కేసులు, నిర్బంధాల గురించి మాట్లాడుతున్నారని, రాజకీయాల్లో అవకాశం ఇస్తే ప్రజలకు ఏం చేస్తారో చెప్పకుండా ఆరోపణలు, అబద్దాలతో నిందలు వేయడం బీజేపీ నేతలకు అలవాటు అయ్యిందని ఆయన మండిపడ్డారు. త్వరలోనే వనపర్తి నియోజకవర్గంలో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా బైపాస్ రహదారికి శంకుస్థాపన, సమీకృత మార్కెట్, టౌన్ హాల్, ఎస్పీ కార్యాలయాలను ప్రారంభించడంతో పాటు భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. 2024 పార్లమెంట్ ఎన్నికలు దేశ భవిష్యత్తుకు పరీక్షగా ప్రజల ముందు ఉందని, ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోకపోతే దేశ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనుందని ఆయన గుర్తు చేశారు. తెలంగాణలో 3వ సారి తిరిగి అధికారంలోకి వచ్చేది కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మంత్రి తన ప్రసంగంలో పేర్కొన్నారు.గతంలో దశాబ్దాల కాలం పాటు పాలించిన వారు ప్రజల జీవితాల్లో మార్పు కోసం వారి అభివృద్ధి కోసం చేసిన కృషిఎంత? ఈ 9ఏళ్లలో ప్రజల్లో వచ్చిన మార్పుఎంత,ఆర్థిక అభివృద్ధి ఎంత అనే విషయంపై ప్రజల్లో చర్చ పెట్టి వారిని ఒప్పించాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజాక్షేత్రంలో ప్రజల కదలికలే నాయకుల ప్రతిభకు గీటురాయిగా నిలుస్తాయని, 3ఏళ్లలో కట్టిన కాళేశ్వరం ఎత్తిపోతలు,దేశ విదేశి ఇంజనీరింగ్ నిపుణుల ప్రసంశలు అందుకుంటుందని, విమర్శలకు ప్రజల తీర్పుతోనే సమాధానం చెప్పాలని, ప్రజలు బీఆర్ఎస్ వెంటే ఉన్నారని, వారి మద్దతు కేసీఆర్‌కే ఉందని, మంత్రి పేర్కొన్నారు. మంత్రి సతీమణి సింగిరెడ్డి వాసంతి, జిల్లా పార్టీ అధ్యక్షుడు గట్టు యాదవ్, జిల్లా గ్రంధాలయ చైర్మెన్ బి.లక్ష్మయ్య, జిల్లా రైతు బంధు అధ్యక్షుడు జగదీశ్వర్ రెడ్డి, మార్కెట్ చైర్మెన్ పలుస రమేష్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్, పెబ్బేరు మున్సిపల్ చైర్మెన్ కరుణశ్రీ, జిల్లా బీఆర్ఎస్ శిక్షణ కమిటీ చైర్మెన్ పురుషోత్తం రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్లు గౌని బుచ్చారెడ్డి, లక్ష్మారెడ్డి, ఎత్తం రవి, జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీ లు, సింగిల్‌విండో చైర్మెన్లు, తదితరులు ఉన్నారు.


అమరవీరుల స్థూపం దగ్గర నివాళి అర్పిస్తున్న మంత్రి నిరంజన్ రెడ్డి


నియోజకవర్గ ప్రతినిధుల సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ కార్యకర్తలు


బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి నిరంజన్ రెడ్డి

# స్వరాష్ట్రంలో ప్రతి ఇంటికి సంక్షేమం..!

- బిఆర్ఎస్ రైతుసంక్షేమ ప్రభుత్వం
- తెలంగాణ పథకాలు దేశం మొత్తం కోరుకుంటుంది
- బిజెపివి మొత్తం తొండి అబద్ధాలే
- కాంగ్రెస్ పార్టీలో నేతల మధ్య విభేదాలు, పంచాయతీలే
- జడ్చర్ల నియోజకవర్గ ప్రతినిధుల సభలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** తెలంగాణ ఏర్పడ్డాక అభివృద్ధి సంక్షేమ ఫలాలు, ప్రతి ఇంటికి చేరుతున్నాయని తొమ్మిదేళ్ల ఫలాలు, ప్రతి ఇంటికి చేరుతున్నాయని తొమ్మిదేళ్ల పాలనను గత పాలనతో బేరీజు వేసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. జడ్చర్ల మండల పరిధిలోని మాచారం గ్రామ పంచాయతీ శివారులో నేషనల్ హైవే వద్ద మంజీరా హోటల్ ఎదురుగా ఏర్పాటు చేసిన టిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ప్రతినిధుల సభలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడారు. వందలాది మంది విద్యార్థులు ప్రాణత్యాగం చేశారని, 14 ఏళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత ఏర్పడిన తెలంగాణ నేడు అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు.మిషన్ కాకతీయతో చెరువులకు జీవంపోసి, కాలువల్లో నీళ్లు పారించి, పంట పెట్టుబడులకు ఆర్థిక సాయం అందించి, వ్యవసాయానికి సైతం 24 గంటల విద్యుత్ అందించి, వ్యవసాయానికి సైతం 24 గంటల విద్యుత్ అందించి, ఎరువులు విత్తనాలు సమయానికి పంపిణీ చేసి రైతు సంక్షేమ రాజ్యాంగా తెలంగాణ నిలిచిందన్నారు. ప్రతిపక్షాలకు తెలంగాణలో పనిలేదన్నారు. మిషన్ భగీరథతో తాగునీరు, ప్రాజెక్టుల ద్వారా వ్యవసాయానికి సాగునీరు, ప్రతి పేద కుటుంబానికి అభివృద్ధి సంక్షేమ పథకాలు చేరుస్తూ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు.ఇప్పటికే 1,30,000 ఉద్యోగాలను ప్రభుత్వం భర్తీచేసి, మరో 90 వేల ఉద్యమాలకు నోటిఫికేషన్లు ఇచ్చిందని తెలిపారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన బిజెపి ఉద్యోగాలు నేడు ఎటుపోయాయని ప్రశ్నించారు. యువతను మభ్యపెడుతూ మత విద్వేషాలను రెచ్చగొడుతూ బిజెపి నాయకులు పబ్బం గడుపుకుంటున్నారని పేర్కొన్నారు. మొన్న బిజెపి జరిగిన సమావేశంలో అమిత్‌షా మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్ రద్దు చేస్తామని ప్రకటించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల్లో పంచాయతీలు ఎక్కువ ఉన్నాయని, సీఎం అభ్యర్థి ఎవరో తేల్చుకోలేక గొడవ పడుతున్నారన్నారు. స్వరాష్ట్రంలో ప్రతి పండగను ప్రశాంతంగా జరుపుకుంటున్నామని బిఆర్ఎస్ పార్టీలో ఉన్నందుకు తామంతా గర్వపడుతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త పార్టీకోసం, ప్రాంతం అభివృద్ధి కోసం కృషి చేయాలని, పనిచేసే ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ నినాదంతో సీఎం కెసిఆర్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ ముందుకు వెళుతుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో గిరిజన కార్పోరేషన్ ఛైర్మన్ వాల్యానాయక్, జడ్పీ వైస్ ఛైర్మన్ యాదయ్య, సంగీత నాటక అకాడమి ఛైర్‌పర్సన్ లక్ష్మి, సర్పంచ్‌ల సంగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్, మార్కెట్ కమిటి ఛైర్మన్‌లు, మండలాలు, గ్రామాలు, వార్డుల అధ్యక్షులు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

# అంబరాన్నంటిన బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల మహాసభ..

- ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆల
- పెద్దఎత్తున హాజరైన పార్టీ నాయకులు,కార్యకర్తలు
- పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయహోదా ఇవ్వాలని తీర్మానం
- గ్రామాలలో ఘనంగా గులాబిజెండా ఆవిష్కరణలు

**దేవరకద్ర,ఎప్రిల్24 ప్రభాతవార్త:** దేవరకద్రలో మంగళవార ం నిర్వహించిన దేవరకద్ర నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల మహాసభ అంబరాన్నంటింది. ఆ మహాసభకు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకాగా నియోజకవర్గంలోని వివిధ మండలాలల నుండి వేలాది మంది పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.బీఆర్ఎస్ పార్టీ అధినేత ముఖ్యమంత్రి కేసీఆర్,వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఈ పార్టీ ప్రతినిధుల మహాసభను దేవరకద్రలోని శ్రీనివాసగార్డెన్‌లో నిర్వహించారు.ఈ సందర్భంగా ముందుగా పార్టీ జెండాను జడ్పీచైర్మెన్ స్వర్ణసుధాకర్‌రెడ్డితో కలసి ఎమ్మెల్యే ఆల పార్టీ నాయకులు,కర్యకర్తలతో కలసి ఎగురవేసి మహాసభను ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల పార్టీ నాయకులు అధికసంఖ్యలో హాజరుకావడంతో సమావేశ ప్రాంగణం కిక్కిరిసి పోయింది. ఈ మహాసభ బీఆర్ఎస్ శ్రేణుల్లో హుషారు రేకెత్తించింది.


దేవరకద్రలో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే,జడ్పీచైర్మెన్

**పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయహోదా ఇవ్వాలి:ఎమ్మెల్యే ఆల**

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయహోదా ఇవ్వాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.దేవరకద్రలో మంగళవార ం నిర్వహించిన దేవరకద్ర నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల మహాసభలో ఎమ్మెల్యే మాట్లాడారు.ఈ సందర్భంగా మహాసభలో ఈ విషయమై ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.దీంతో పార్టీ నాయకులు,కార్యకర్తలు దాదాపు నిముషంపాటు చప్పట్లు కొట్టి దీనికి సంఘీభావం తెలిపారు. పార్టీ -మిగతా2లో..


మహాసభకు హాజరైన పార్టీ నాయకులు,కార్యకర్తలు


మాట్లాడతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

## మంత్రి పర్యటనకు ఏర్పాట్లు పకడ్బందిగా పూర్తి చేయాలి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** ఈ నెల 29వ తేదీన రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మన్ననూర్ పర్యటనకు ఏర్పాట్లు పకడ్బందిగా చేయాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి పర్యటన ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర గిరిజన సంక్షేమం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ఈ నెల 29న మన్ననూర్‌లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డైగ్నస్టిక్ సెంటర్,చెంచులక్ష్మి రెస్టారెంట్, స్వయం ఉపాధి యూనిట్ల గ్రౌడింగ్, సీసీ రోడ్ల శంకుస్థాపన తదితర కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. ఇందుకు అవసరమైన ప్రోటోకాల్, ఓవరాల్ ఇన్‌చార్జి బాధ్యతలు ఆర్డీఓ అచ్చంపేటకు అప్పగించారు. అయినోల్‌లో బహిరంగ సభలో పాల్గొంటారని, ఇందుకు సంబంధించిన బాధ్యతలను డీటీడీఓకు అప్పగించారు. యంఎస్‌యంఈ, స్వయం ఉపాధి యూనిట్ల పంపిణీ కార్యక్రమం సజావుగా నిర్వహించే విధంగా చూడాలని ఆదేశించారు. రెవెన్యూ, గిరిజన సంక్షేమ శాఖ, ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేసి పర్యటన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అచ్చంపేట ఆర్డీఓ పాండునాయక్, డీటీడీఓ కమలాకర్‌రెడ్డి, ఆర్సీఓ నాగార్జున, జి.జి.సి మేనేజర్ సంతోష్, పి.ఓ.ఐ.టి.ఏ మేనేజర్ జాఫర్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.


మంత్రి పర్యటన ఏర్పాట్లపై దిశా నిర్ధేశం చేస్తున్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

## ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు..

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**వనపర్తి ప్రతినిధి,ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి వైద్యం పట్ల వైద్య సిబ్బంది శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం వనపర్తి పట్టణంలోని ఎంసీహెచ్ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆసుపత్రిలోని అన్ని వార్డులను తనిఖీ చేశారు. వైద్యులు రోగులకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం ద్వారా అందించే వైద్య సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా వార్డులలో అన్ని విభాగాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేసి ఆసుపత్రిలో అందే సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం పట్టణ సమీపంలోని పొడి వ్యర్థ వనరుల సేకరణ కేంద్రం, డంపింగ్ యార్డును కలెక్టర్ తనిఖీ చేశారు. అలాగే జంతు నియంత్రణ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. టేకోమా చెట్లు పెట్టవలసిందిగా మున్సిపల్ కమీషనర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డా.నరేందర్, డా.రాజ్ కుమార్, రాజేంద్ర గౌడ్, మున్సిపల్ కమీషనర్ విక్రం సింహారెడ్డి,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఆసుపత్రిలోని రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



జంతు నియంత్రణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

## ప్రజావాణి ధరఖాస్తులను పరిష్కరించాలి

**ముఖ్య ప్రణాళికాధికారి భూపాల్‌రెడ్డి**



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** ప్రజావాణిలో వచ్చిన ధరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ముఖ్య ప్రణాళికాధికారి భూపాల్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వివిధ శాఖల సమస్యల పరిష్కారంపై వచ్చిన 19 ఫిర్యాదులను ముఖ్య ప్రణాళికాధికారి భూపాల్‌రెడ్డి స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరి ష్కారంలో అధికారులు చొరవ చూపాలన్నారు. ప్రజావాణిలో డీఆర్డీఏ పీడీ నర్సింగరావు, ఆయా శాఖల జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు గ్రంథాలయ పుస్తకాల పంపిణీ



**కల్వకుర్తి, ఏప్రిల్24 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం పంజుగుల గ్రామంలోని యూపీఎస్ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు క్లాస్‌మెట్ క్లబ్ కల్వకుర్తి వారిచే దేశ నాయకుల పుస్తకాలు, స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న నాయకుల జీవిత చరిత్ర పుస్తకాలను క్లాస్‌మెట్ క్లబ్ అధ్యక్షులు రాఘవేందర్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు దేశ నాయకుల, స్వాతంత్ర్య ఉద్యమ నాయకుల జీవితాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు గ్రంథాలయ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్లయ్యగౌడ్, సెక్రటరి శ్రీనివాసులు, మాజీ ప్రెసిడెంట్ సురేష్‌శెట్టి, కార్యదర్శి కుమారస్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమాదేవి, పుష్పవతి, పాండయ్య, కృష్ణయ్య, జంగయ్య, శ్రావణి, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## నిరుద్యోగమార్చ్‌ను విజయవంతం చేద్దాం..

**-బిజేపి ఇంచార్జి ఎగ్గని నరసింహ్ములు**



**దేవరకద్ర, ఎప్రిల్ 24 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్‌లో మంగళవారం నిర్వహించే నిరుద్యోగమార్చ్‌ను విజయవంతం చేద్దామని దేవరకద్ర నియోజకవర్గ బిజేపి ఇంచార్చి ఎగ్గని నరసింహ్ములు కోరారు. దేవరకద్రలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీలకు అతీతంగా విధ్యార్థులు ఈ నిరుద్యోగమార్చ్‌కు అధికసంఖ్యలో తరలిరావాలన్నారు. టీఎస్‌పిఎస్‌సి ప్రశ్నాపత్రాల లీకేజి వ్యవహారంలో వరంగల్ తరహాలో పాలమూరు బిజెపి మిలియన్ మార్చుకు పిలుపునిచ్చిందన్నారు. బీజేపి పార్టీ ఎప్పుడు నిరు ద్యోగుల పక్షాన ఉంటుందన్నారు. 30లక్షల మంది నిరుద్యోగుల జీవితాల గురించి బిజేపి పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వం విధ్యార్థులను, నిరుద్యోగులను నిర్లక్ష్యం చేస్తుందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లి కన్వీనర్ కురువ రమేశ్, మండల అధ్యక్షుడు కొండ అంజన్‌కుమార్‌రెడ్డి, నాయకులు సత్యన్నగౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, సత్యన్న, దశరథ, చంద్రశేఖర్, దేవన్న, జనార్థన్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షల ఏర్పాట్లు పూర్తి



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్24 ప్రభాతవార్త:** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ 2022-23 విద్యా సంవత్సరం టెన్త్, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు డీఈఓ గోవిందరాజులు తెలిపారు. మం గళ వారం నుంచి మే 4వరకు నిర్వహించే పరీక్షలకు జిల్లాలోని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తిలో కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చేపడుతున్న ఈ పరీక్షలకు 1658 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వ హణకు చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులు, ఇన్విజిలేటర్లతో పాటు ఫ్లయింగ్ సా ్క్వడ్ ను నియమించారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లకు అనుమతి లేదని డీఈఓ తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలను సజావుగా నిర్వహించాలని ఆయన సూచించా రు. జిల్లా కేంద్రంలోని పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లను ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ నాగరాజ్ పరిశీలించారు.

## నిరుద్యోగ మార్చ్ సభను విజయవంతం చేయాలి..

**మండల బిజెపి అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి**



**కోయిల్‌కొండ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలో నేడు నిర్వహించే నిరుద్యోగ మార్చ్ సభను విజయవంతం చేయాలని మండల బిజెపి అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కరుణాకం రెడ్డిలు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రమైన కోయిల్‌కొండలో నిరుద్యోగ మార్చ్ సమావేశ గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కోయిల్‌కొండ మండలం నుంచి బిజెపి పార్టీ కార్యకర్తలు, పార్టీ ప్రజా ప్రతినిధులు, భారీ స్థాయిలో తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమానికి రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ ముఖ్య అతిథిగా రావడం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాటాడుతుందన్నారు. కార్యక్రమంలో మండల బిజెపి మాజీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ఆనంద్‌రెడ్డి, పార్టీ నాయకులు రాములుగౌడ్, జిల్లా బిజెపి గిరిజన మోర్చా అధ్యక్షుడు గోవిందు నాయక్, నాయకులు చరణ్, శ్రీకాంత్, నరేష్, వీరేష్, శ్రీనివాసులు, నిరంజన్, మున్నూరు రాజు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి సెలవుల్లో విద్యార్థుల వృథా చేసుకోవద్దు..

**డిఎస్‌ఆర్ సేవాదళం ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్నులు, నోట్ పుస్తకాలుపంపిణీ**

**కార్యక్రమంలో పాల్గొన్న ధరూర్ సర్పంచ్ పద్మమ్మ**



**ధరూర్, ఏప్రిల్24 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హరిజ చెర్రిలో 5వ తరగతి ముగిసిన విద్యార్థులకు డిఎస్ఆర్ సేవాదళం సభ్యుడు ధరూర్ రవి ఆధ్వర్యంలో పెన్నులు, నోట్‌పుస్తకాలు ధరూర్ గ్రామ సర్పంచ్ పద్మమ్మ, హెచ్‌ఎం రేవతి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు ఇంటి దగ్గర ఉండి ముందు తరగతులకు సంబంధించిన పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని, పంట పొలాల పనులకు, బావుల వద్దకు ఇంతకు గాని ఎండలకు తిరగకుండా జాగ్రత్త వహించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు మంచి నడవడికతో పాటు చెడు ప్రభావాలు అలవాట్లకు గురి కాకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఆర్ సేవదళం సభ్యుడు ధరూర్ రవి, సర్పంచ్ పద్మమ్మ, హెచ్‌ఎం రేవతి, ఉపాధ్యాయ బృందం కిశోర్‌చంద్ర, నీలవతి, డేవిడ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఐకెపి విఓఎ నిరవధిక సమ్మె..

**మద్దతు తెలిపిన రాష్ట్ర బిజెపి సీనియర్ నాయకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య**



**మక్తల్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** ఐకెపి విఓఎలు నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నారు. సోమవారం బిజెపి రాష్ట్ర నాయకులు కొండయ్య వారి సమ్మెకు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వివోఎలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, ఈరోజుల్లో రాష్ట్రప్రభుత్వం అందించే 3900 కనీసం వారి వారి గ్రామాల నుండి ఐకెపి కార్యాలయానికి రావడం కొరకు పెట్రోల్‌కు కూడా సరిపోవని ఇటువంటి దయనీయ స్థితిలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా మేల్కొనాలని, కనీసం విఓఎలకు భీమా సౌకర్యం కల్పించకపోవడం, రాష్ట్ర ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనం అని అన్నారు. సెర్ప్ నుండి ఐడి కార్డులు ఇవ్వాలని, గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతినెల వారి వేతనాలను వారి ఖాతాలోకి అందించాలి. విఓఎలకు మహిళా సంఘాల ఒత్తిడి ఎక్కువై ఉన్నందున అభయహస్తం డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విధంగా వారికి సరైన అవకాశాలు కల్పించకపోతే ఉద్యమం ముందుకు తీసుకెళ్లి వారితో కలిసి భారతీయ జనతాపార్టీ తరపున మున్ముందు పోరాడాల్సి వస్తుందన్నారు. ఇట్టి నిరవధిక సమ్మెలో బిజెపి జిల్లాకార్యదర్శి కల్లూరి నాగప్ప, మక్తల్ మండల బిజెపి అధ్యక్షుడు చిట్యాల లక్ష్మణ్, కాచువార్ ఎంపిటిసి బలరాంరెడ్డి, బిజెవైఎం జిల్లా కార్యదర్శి మంజునాథ్, బిజెపి నాయకులు నగేష్, నర్సింలు, బాబు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ సమ్మె..

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మంగళవారం నుంచి సమ్మెలో ఉండనున్నట్లు యూనియన్ డివిజన్ ప్రెసిడెంట్ నిజామొద్దిన్, కార్యదర్శి రమేశ్ గౌడ్ తెలిపారు. పీఆర్‌సీ 7శాతం ఇస్తామని చెప్పడం వల్ల తాము నష్టపోతామని, ఏపీఎస్ఈబీ రూల్స్ అమలు చేయాలని, 50శాతం పీఆర్‌సీ అమలు చేయాలనే డిమాండ్లకు యాజమాన్యం స్పందించనందు వల్ల మంగళవార నుంచి సమ్మెకు దిగుతున్నట్లు తెలిపారు. ఈమేరకు ప్రజలు, రైతులు తమకు సహకరించాలని కోరారు.

# అన్నదాతలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం:దేవరకద్ర జడ్పీటీసీ,యంపీపీ

**దేవరకద్ర ఎప్రిల్ 24 ప్రభాతవార్త:** అన్నదాతలకు ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని జడ్పీటీసీ అన్నపూర్ణ శ్రీకాంత్, యంపీపీ కుర్వ కెంగూరి రమాశ్రీకాంత్‌యాదవ్ అన్నారు. దేవరకద్రతో పాటు కౌకుంట్ల, గుడిబండ, గోపన్‌పల్లి, డోకూర్ గ్రామాలలో దేవరకద్ర పీఏసిఎస్ అధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాలకు జడ్పీటీసీ అన్నపూర్ణ శ్రీకాంత్, యంపీపీ కుర్వ కెంగూరి రమాశ్రీకాంత్‌యాదవ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం చేసి చూపిస్తుందన్నారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అన్నదాతలను అన్ని విధాలుగా ఆదుకొన్న ఘనత ప్రభుత్వానికే దక్కిందన్నారు. రైతుల సంక్షేమానికి రైతుభీమ, రైతుబంధు పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. అలాగే పంటల సేద్యానికి పుష్కలంగా సాగునీటిని అందిస్తున్నామన్నారు. అన్నదాతలకు అత్యధిక ప్రాధాన్యతను ప్రభుత్వం ఇస్తుందన్నారు. అలాగే ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం అహర్నిషలు పాటుపడుతుందన్నారు. ఈ సందర్బంగా పూజలు చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ యంపీపీ తుమ్మల సుజాతాశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జెట్టి నరసింహ్మారెడ్డి, మాజీ అధ్యక్షుడు కేంగూరి శ్రీకాంత్‌యాదవ్, మార్కెట్ చైర్మెన్ విజయవెంకటేశ్, పీఏసిఎస్ చైర్మెన్ నరేందర్‌రెడ్డి, సీఈఓ శ్రీనివాసులు, వ్యవసాహాధికారి రాజేందర్‌అగర్వాల్, మార్కెట్ కార్యదర్శి ఎల్లస్వామి, నాయకులు ఉమ్మిగారి వెంకటేశ్, మున్నూరు బాల్‌రాజ్, నాయకులు కొండరెడ్డి, కృష్ణగోపాల్, కొండ భాస్కర్‌రెడ్డిలతో పాటు ఆయా గ్రామాల రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**5 గ్రామాలలో ధాన్యం కొనుగోలుకేంద్రాలు ప్రారంభం**



దేవరకద్రలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు



డోకూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

# మే10లోపు జిల్లా మహాసభలు..!

**- పాలమూరులో టీయూడబ్ల్యూజేకు తిరుగులేదు - రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే విరాహత్ అలీ**




సమావేశంలో మాట్లాడుతున్న విరాహత్ అలీ

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** రాష్ట్ర కార్యవర్గ నిర్ణయం మేరకు మే10లోపు జిల్లా మహాసభల ప్రక్రియ పూర్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే విరాహత్ అలీ సూచించారు. జడ్చర్ల పట్టణం కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి పాలమూరు జిల్లా యూనియన్ ముఖ్యుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉమ్మడి రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టుల ఉద్యమానికి పాలమూరు జిల్లాలోనే నాడు బీజం పడిందని ఏపీయూడబ్ల్యూజే సంఘమేనని దాని వారసత్వంతో తెలంగాణలో పురుడుపోసుకున్న టీయూడబ్ల్యూజే అదే స్ఫూర్తితో పని చేస్తుందని అన్నారు. ఆరు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ పోరాటాల చరిత్ర కలిగిన తమ సంఘం వేలాది జర్నలిస్టుల ఆదరాభిమానాలు పొందుతుందన్నారు. ఎవరెన్నీ మాటలు మాట్లాడినా ఐక్యతా, పోరాటాలు, త్యాగాల కలయికే టీయూడబ్ల్యూజే లక్ష్యమన్నారు. రాష్ట్రంలోని 33జిల్లాల్లో తమ సంఘానికి ఎదురులేదని, అత్యధిక జర్నలిస్టులకు ప్రాధాన్యం వహిస్తున్న సంస్థగా దేశవ్యాప్తంగా పేరుపొదండం గర్వంగా ఉందన్నారు. సంఘం చరిత్రను నెమరువేసుకుంటూ నిరంతరం జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటుపడాల్సిన బాధ్యత జిల్లా కమిటీలపై ఉంటుందన్నారు. అనతరం యూనియన్ సభ్యులు విరాహత్ అలీని సన్మానించారు. ఈ సందర్బంగా మూడు జిల్లాల మహాసభల తేదీలను ఖరారు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు దత్తేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గుడిపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వర్‌రావు, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడు రవీందర్‌రెడ్డి, వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల జిల్లాల అధ్యక్షులు మధు, సుదర్శన్‌రెడ్డి, శ్యాం, మహబూబ్‌నగర్ కార్యదర్శి రామాజంనేయులు, నారాయణపేట కన్వీనర్ యాదన్న పాల్గొన్నారు.

## పోలీసులు అంకిత భావంతో పనిచేసి

# ప్రజలకు మెరుగైన సేవలందించాలి: జిల్లా ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు

**నారాయణపేట ప్రతినిధిఏప్రిల్ 24 ప్రభాతవార్త :** నిరుద్యోగుల మార్చ్ విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన పోలీస్ అధికారులకు, సిబ్బందికి జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు మొత్తం 14 మందికి కెపిఐ రివార్డులు అందజేయడం జరిగింది. ఈసందర్బంగా ఎస్పీ మాట్లాడుతూ నారాయణపేట జిల్లా పరిధిలో ఫంక్షనల్ వర్టికల్ వారిగా విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన పోలీస్ అధికారులు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ప్రతి ఒక్కరు ప్రజల రక్షణ కోసం అంకితభావంతో విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలందించడానికి సిద్దంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఫంక్షనల్ వర్టికల్ వారిగా పోటీపడి విధులు నిర్వహించి రివార్డులు, అవార్డులు పొందాలని సూచించారు. కష్టపడి అంకితభావంతో విధులు నిర్వహించే వారికి డిపార్టుమెంట్లో ఖచ్చితంగా గుర్తింపు ఉంటుందని తెలిపారు. రివార్డులు అందుకోవడానికి అధికారులు పోటీపడి విధులు నిర్వహించాలని సూచించారు. ఏ అధికారి రికమండేషన్ లేకుండా ఆన్‌లైన్ డాటా నమోదు చేసిన విధంగా సిసిటిఎన్ఎస్, టిఎస్ కాప్ ఆధారంగా వారి పనితనాన్ని బట్టి పూర్తి పారదర్శకంగా రివార్డులు, అవార్డులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పోలీసులు అహర్నిశలు శ్రమిస్తూ ప్రజలకు పూర్తి రక్షణ, భద్రత కల్పించుటకు వినూత్నమైన, సంస్థాగతమైన చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలందించడానికి వర్టికల్స్ వారిగా విధులు విభజించడం వారి పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలకు మరింత వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది మరింత బాధ్యతాయుతంగా ప్రజలకు సేవలందించాలని ఎస్పీ సూచించారు.





ప్రతిభ కనబర్చిన పోలీస్
సిబ్బందికి అవార్డులు, రివార్డులు అందజేస్తున్న దృశ్యం

# 4వ వార్డు అభివృద్ధికి నిధులు కేటాయించండి..

**జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేసిన 4వ వార్డు కౌన్సిలర్ పద్మపరుశురాం..**



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న 4వ వార్డు కౌన్సిలర్

**వనపర్తి టౌన్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** వనపర్తి మున్సిపాలిటీ 4వ వార్డులో అభివృద్ధికి నిధులు కేటాయించాలని 4వ వార్డు కౌన్సిలర్ పద్మ పరుశురాం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం 2019 మున్సిపల్ చట్టం ప్రకారంగా విలీనమైన గ్రామాలకు నిధులు కేటాయించాలని చట్టంలో పొందుపరిచి ఉందని, అదేవిధంగా స్లమ్ ఏరియాలను స్పెషల్ కేటగిరిగా గుర్తించి అనేక నిధులు ఇవ్వాలని చట్టంలో పొందుపరచడం జరిగింది కానీ వనపర్తి మున్సిపాలిటీలో బడ్జెట్‌లో నిల్ చూయిస్తున్నారని, నిధులు మిత్రం ఇవ్వడం లేదని, 2022-23 బడ్జెట్‌లో ఈ అంశాన్ని పొందుపరచడం జరిగిందని, నిధులు కేటాయించే విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. కొత్తగా ఏర్పాటు అయిన విలీన గ్రామాలను స్లం ఏరియాలకు అధిక నిధులు ఇచ్చి అభివృద్ధి చేయాలని కోరారు. అదే విధంగా నర్సింగాయిపల్లి గ్రామాన్ని వనపర్తి మున్సిపాలిటీలో విలీనం చేసి దాదాపు 4ఏళ్ల అవుతున్న ఇప్పటివరకు రెవెన్యూ వనపర్తి మున్సిపల్‌లో కలపకపోవడం వలన అనేక రకాల ఇబ్బందులకు గురి అవుతున్నారని, కులం సర్టిఫికేట్ ఆదాయం సర్టిఫికేట్ గోపాల్‌పేట మండలానికి వెళ్తే గోపాల్‌పేట మండలానికి వెళ్తే బర్త్ అండ్ అండ్ డెత్ సర్టిఫికేట్ వనపర్తి మున్సిపాలిటీకి రావడం జరుగుతుందని తెలిపారు. మున్సిపాలిటీకి రావాల్సిన రెవెన్యూ ప్లాట్ల రిజిస్ట్రేషన్ పర్సెంటేజ్ అన్నీ కూడా తాడిపర్తి గ్రామపంచాయితీకి వెళ్లా ఉన్నాయని, కావున ఈ యొక్క విషయం పై అనేక సార్లు కమీషనర్ గా దృష్టికి, చైర్మెన్ దృష్టికి తీసుకెళ్లిన ఇలాంటి స్పందన లేదు కావున నర్సింగాయిపల్లి గ్రామానికి శివారు ఏర్పాటు చేసి ఈ యొక్క రెవెన్యూ వనపర్తిలో కలపాల్సిందిగా వార్డు ప్రజలు కోరుతున్నారని ఆయన తెలిపారు.

## శ్రీ తిమ్మప్పస్వామిని సందర్శించుకున్న జిల్లా జడ్జి

**మల్దకల్, ఏప్రిల్24 ప్రభాతవార్త:** శ్రీ స్వయంభూ లక్ష్మి వెంకటేశ్వ రస్వామి దేవాలయాన్ని సోమవారం జోగులాంబ గద్వాల ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి ఎం. కనక దుర్గ ఆమె కుమారుడు తిలక్ దత్తులు సందర్శించి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. వారికి దేవాలయ అర్చకులు రవి, వాల్మీకి పూజారులు పూర్ణకుం భంతో స్వాగతం పలికి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం న్యాయమూర్తిని పట్వారి అరవిందరావు, స్వామివారి శేషవస్త్రం, తీర్థ ప్రసాదాలను అందజేశారు.



## నేడు బీజేపీ నిరుద్యోగ మార్చ్..

**- ఏర్పాట్లు పరిశీలించిన నేతలు**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడుతూ, లక్షలాది మంది నిరుద్యోగులకు అండగా నిలిచేందుకు బీజేపీ ఆధ్వర్యంలో తలపెట్టిన నిరుద్యోగ మార్చ్ మంంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించనున్నారు. ఈమేరకు ఉమ్మడి జిల్లా నుంచి నిరుద్యోగులు టీటీడీ కల్యాణ మండపం వద్దకు చేరుకొని అక్కడి నుంచి ర్యాలీగా క్లాక్‌టవర్‌కు చేరుకుం టారు. ఈ మేరకు క్లాక్‌టవర్ వద్ద సభ ఏర్పాట్లను రాష్ట్ర నాయకులు వీరేందం గౌడ్, ప్రదీప్‌గౌడ్, ఎన్‌వీఎస్ ప్రభాకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి, భరత్‌గౌడ్, మిథున్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు.

## యూత్ కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్



**కల్వకుర్తి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** ఎన్నికల సమయంలో కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికై సీఎం కేసీఆర్ చేసిన మోసపూరిత హామీలపై ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం యూత్ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. పోలీసులు ముందస్తులో భాగంగా యూత్ కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎన్నికల మెనిపెస్టోలో ఇచ్చిన ఏ ఒక్క హామీలను నేరవేర్చలేదని, ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చారని వారు పేర్కొన్నారు. అనంతరం సొంత పూచీకత్తుపై యూత్ కాంగ్రెస్ నాయకులను విడుదల చేశారు.

## నేడు కౌకుంట్లలో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ..



**దేవరకద్ర, ఎప్రిల్ 24 ప్రభాతవార్త:** కౌకుంట్లలో మంగళవారం బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు వై.శివకుమార్ తెలిపారు. ఉదయం 8.30లకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. బీఆర్ ఎస్ పార్టీ 22 వసంతాల ప్రయాణం పూర్తి చేసుకొని 23వ ఏట అడుగుపెడుతున్న నేపథ్యం లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ పార్టీ అవతరించి తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి దిక్సూచిలా నిలబెట్టడమే కాకుండా భారత రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించే రాజకీయ శక్తిగా పురోగమించబోతున్న వేళ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కావున మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబందసంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు అందరూ అధికసంఖ్యలో హాజరుకావాలని శివకుమార్ కోరారు.

## గుడి నిర్మాణానికి రూ.20వేల విరాళం



**కోయిల్‌కొండ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** కొతలాబాద్ గ్రామంలోనూ తనంగా నిర్మిస్తున్న శ్రీ సీతా రామాంజనేయ గుడి పునర్నిర్మాణానికి గ్రామ మూడవ వార్డు సభ్యురాలు దాయాపల్లి మమతా రాజు ముందుకు వచ్చి స్వచ్చందంగా గుడి నిర్మాణం కోసం రూ.20 వేలు విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. దీంతో గ్రామస్తులు మూడవ వార్డు సభ్యురాలైన దాయపల్లి మమతారాజును అభినందించారు. ఇలాంటి దాతలు ముందుకు వస్తే గుడి నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీఎంపిటిసి రాజారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మాధవరెడ్డి, కృష్ణారెడ్డి, భూపాల్‌రెడ్డి, మాధవులు, టీచర్ శేఖర్‌రెడ్డి, భూప్‌రెడ్డి, లక్ష్మణాచారి, శేఖర్‌రెడ్డి, మల్లారెడ్డి, రాంభూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన డ్రైనేజీ పనులను ప్రారంభించిన చైర్‌పర్సన్



**మహబూబ్‌నగర్‌ప్రతినిధి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీలోని 25వ వార్డులో చౌడమ్మ గుట్ట వద్ద నూతన డ్రైన్ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ దోరెపల్లి లక్ష్మిర వీందర్ సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పనులు నాణ్యవంతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు దోరెపల్లి రవీందర్, వార్డు కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## ఒంటికాలిపై ఐకేపీ వీవోఏల నిరసన..



**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** ఐకేపీ వీవోఏలు సోమవారం ఒంటికాలిపై నిరసన తెలిపారు. జడ్చర్ల ఎంపీడీవో కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐకేపీ వీవోఏల సమ్మె ఎనిమిదో రోజుకు చేరుకున్నది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య మాట్లాడుతూ 22 ఏండ్లుగా పని చేస్తున్న ఐకేపీ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, సాధారణ భీమా రూ. 10లక్షలు సౌకర్యం కల్పించాలని, ఐడెంటీ కార్డులు ఇవ్వాలని, కనీసం రూ.26వేల వేతనం ఇవ్వాలని కొంతకాలంగా సమ్మె నిర్వహిస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెను మరింత ఉధృతంగా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు జోగు కృష్ణయ్య, బేగం సరిత, రమేశ్, సరస్వతి, కల్పన, అలివేల, మహేశ్వరి, జంగమ్మ, స్వరూప, రాణి, బాలమణి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అన్ని రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది

- అతి త్వరలోనే మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణం
- రూ.1600ల కోట్లతో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు : అలంపూర్ ఎమ్మెల్యే డా.వి.ఎం అబ్రహాం
- గులాబీ సైనికులంతా ఒకే కుటుంబం
- జిల్లా ఇంఛార్జ్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవిందర్‌రావు

**అలంపూర్,ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** అలంపూర్ చౌరస్తాలోని మార్కెట్ యార్డులో జరిగిన అలంపూర్ నియోజకవర్గ పార్టీ ప్రతినిధుల మహాసభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే డా.వి.ఎం అబ్రహాం,జిల్లా ఇంఛార్జి ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవిందర్‌రావు ముందుగా సభా ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పతాకాన్ని ఆవిష్కరించి అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి సమావేశానికి ముందు అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. అలాగే సభలో అమరవీరులకు సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ప్రతినిధులు భారత రాష్ట్ర సమితి పార్టీ అలంపూర్ నియోజకవర్గ ప్లీనరీలో 12 అంశాల తీర్మాణాలను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కెసిఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత అభివృద్ధి ఎలా ఉంది, అంతకు ముందు ఎలా ఉందో ప్రజలు ఆలోచించాలన్నారు. ప్లీనరీలో చేసే తీర్మాణాలపై గ్రామల్లో చర్చ జరగాలని, దేశంలో ఏ శాఖకు రానన్ని అవార్డులు తెలంగాణ రాష్ట్రానికి రావడం గర్వకారణన్నారు. కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని, కాంగ్రెస్, బిజెపి పాలిత రాష్ట్రాల్లో తెలంగాణలో ప్రతి గ్రామంలో చర్చ జరగాలన్నారు. నేను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాలకు, సంక్షేమ పథకాలకు దాదాపు 1600ల కోట్ల రూపాయలను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. అతి త్వరలోనే మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని సీఎం కెసిఆర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి కోరామని తెలిపారు. దానికి సీఎం కెసిఆర్ తప్పకుండా రిజర్వాయర్ నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. తక్కెళ్లపల్లి రవిందర్‌రావు మాట్లాడుతూ బిజెపి నాయకులకు సిగ్గుందా? ఎకరానికి రూ 10 వేలు ఇస్తున్న దేవుడు కెసిఆర్ అని మీకు సిగ్గుంటే, దమ్ముంటే కేంద్రం నుండి మరో పదివేలు ఇప్పించాలని గులాబీ సైనికులంతా ఒకే కుటుంబం మనమంతా కలిసి మెలిసి ఉందాం మనపై మాటల దాడి చేస్తున్న బిజెపి, కాంగ్రెస్‌ల కుట్రలను తిప్పి కొడదామని మన సీఎం కెసిఆర్ రాష్ట్రంలో చేస్తున్న అలంపూర్ నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రపంచానికి చాటుదామన్నారు. మన ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలంగాణ అభివృద్ధి, సంక్షేమానికి అడ్డుపడుతున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వైఖరిని తిప్పికొడదామని కేంద్రంలో అబ్ కీ బార్ కెసిఆర్ సర్కార్ నినాదాన్ని నిజం చేస్తూ, దేశాన్ని మన కెసిఆర్‌కి ఇద్దాం గుజరాత్ కాదు తెలంగాణ మోడల్‌ను దేశానికి ఇద్దామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు, డైరెక్టర్లు, జడ్పీటిసిలు, ఎంపిపిలు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, మాజీ ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


పార్టీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

## ఘనంగా బీఆర్ఎస్ జెండా పండుగ


బీఆర్ఎస్ జెండావిష్కరిస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

**శ్రీరంగాపురం,ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** బీఆర్ఎస్ జెండా పండుగను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం భారత రాష్ట్ర సమితిపార్టీ జెండా పండుగను మండల కేంద్రంలో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ జెండా ఎగరవేయడం జరిగింది. దీంతో ఊరూర గులాబీ జెండా రెపరెపలాడింది. జై తెలంగాణ, జై భారత్, జై కేసీఆర్, జై ఎస్ఎన్ఆర్ నినాదాలతో గ్రామాలన్నీ మారుమోగాయి. ఊరూర పార్టీ జెండాలను ఆవిష్కరించిన తరువాత పార్టీ కార్యకర్తలు, నాయకులు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ప్రతినిధుల సభకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆర్.వెంకటస్వామి, సీనియర్ నాయకులు పృద్వీరాజు, స్థానిక సర్పంచ్ వినీలరాణి కురుమయ్య, ఉపసర్పంచ్ చీర్ల శివ సాగర్, కోఆప్షన్ ఆరిఫ్, గ్రామ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, ఆయాగ్రామాల్లో స్థానిక సర్పంచులు నాగరాల నిర్మల రాధాకృష్ణ, జానంపేట వెంకటేశ్వర్ రెడ్డి, నాగసానిపల్లి ఆంజనేయులు, తాటిపాముల సత్యం యాదవ్, కంబలాపురం ఎద్దుల మంజుల రాజవర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గొడుగు సత్యనారాయణ, బోలెద్దుల ఆంజనేయులు, ఎండి సిరాజుద్దీన్, పరుషురామ్ యాదవ్,గుంటి కృష్ణయ్య, కటికె ఖాజ, డి.చంద్రయ్య, గాజుల శివ, కేశపాగ శ్రీనివాసులు, మంగలి శ్రీను, వెంకటస్వామి, ఆయా గ్రామాల స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ పార్టీలో చేరికలు


బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

**అమరచింత,ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మక్తల్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి అమరచింత పట్టణానికి చెందిన 20మంది యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారని వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లాలని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి సైనికుల్లా పని చేయాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## పార్టీ జెండాను ఆవిష్కరించిన బిఆర్ఎస్ యువజన నాయకులు

**అలంపూర్,ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్, ఐటిశాఖ మంత్రి కెటిఆర్ ఆదేశానుసారం బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను అలంపూర్ చౌరస్తాలోని కార్యాలయం ముందు తెలంగాణ తల్లికి పూజ నిర్వహించి అనంతరం జెండాను ఆవిష్క రించారు. తెలంగాణ ప్రజలు నీళ్ళు,నిధుల కోసం బిక్షమెత్తాల్సి వస్తుందని ఎవరి కింద తెలంగాణ ప్రజలు బానిసలుగా బతకొద్దని తలంచి దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ పేరుమీద తెలంగాణ రాష్ట్ర సమితి అని 2001 ఏప్రిల్ 27న మన తెలంగాణ ప్రజల కోసం తెలంగాణ రాష్ట్ర సమితిని ఆవిర్భవింపజేసిన కార్యసాధకుడు, అలుపెరగని పోరాటయోధుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తెలంగాణ ప్రజలకు ఉద్యమ స్ఫూర్తి నేర్పి సకల జనుల సమ్మెకుసై అని సైరన్ మోగించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న కృషీవ లుడు మన సీఎం కెసిఆర్ అన్నారు. కార్యక్రమంలో ఆనంద్,విష్ణు, కిశోర్, యువసైన్యం సభ్యులు పాల్గొన్నారు.



## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన టీఎంఆర్ యువజన సంఘం సభ్యులు

**పెద్దమందడి,ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** మండల కేంద్రాలకు చెందిన అద్దాల చిన్నమ్మ మృతి చెందడంతో విషయం తెలుసుకున్న టీఎంఆర్ యువజన సంఘం సభ్యులు వారి కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు.నిరుపేద కుటుంబం కావడంతో అంతిమ సంస్కారానికి కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కూతురు కాశమ్మకు ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు టీఎంఆర్ యువజన సంఘం సభ్యులు తెలిపారు. తమ ఆర్థిక ఇబ్బందిని గుర్తించి ఆర్థిక సహాయం అందజేసి టీఎంఆర్ యువజన సంఘం సభయలకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు ప్రవీణ్‌రెడ్డి, టైలర్‌రవి, మెడికల్ షాప్ నరసింహ, వర్తిపురం రాములు, రాజుపాల్గొన్నారు.


ఆర్థిక సహాయం అందజేస్తున్న టీఎంఆర్ యువజన సంఘం సభ్యులు

## వనపర్తి జిల్లాను మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**వనపర్తి ప్రతినిధి,ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాను మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం మలేరియా డే సందర్భంగా పాలిటెక్నిక్ కళాశాల నుండి అంబేద్కర్ చౌక్ వరకు వైద్యశాఖ ఏర్పాటు చేసిన ర్యాలీని జిల్లా కలెక్టర్ పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2020లో 29 కేసులు అయ్యాయని, 2021, 2022, 2023లో ఎలాంటి కేసులు లేవని ఇలాగే కొనసాగించి 2023 వరకు మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ కోరారు. ఇందు కొరకు వైద్య శాఖ గ్రామపంచాయితీ ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఏఎ సాయినాథ్‌రెడ్డి, మున్సిపల్ కమీషనర్ విక్రం సింహారెడ్డి, అధికారులు, డాక్టర్లు, సిబ్బంది, ఆశవర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.


మలేరియా డే ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను విజయవంతంగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్



**వనపర్తి ప్రతినిధి,ఏప్రిల్25 ప్రభాతవార్త:** వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సర్ఫ్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీలో సెర్ఫ్ కార్యకలాపాలపై రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. శ్రీనిధి ఏర్పాటు చేయడంలో చర్యలు తీసుకోవాలని అన్నారు. మహిళ రుణాలకు బ్యాంకు లింకేజీ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు రుణాలు రికవరీ జరిగేలా చూడాలని అన్నారు. డిసెంబర్ లోపు టార్గెట్ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మండలానికి ఒక మహిళ గ్రూప్ యాక్టివిటీ ఉండేలా చూడాలని అన్నారు. అనేక అంశాలపై కలెక్టర్ సిబ్బందికి జారీ చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ డీఆర్డీ ఎ.కృష్ణయ్య, ఎల్‌డిఎం అమూల్ పవార్, రేణుక, ఏపీఎం లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 29న ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**వనపర్తి టౌన్,ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా బజార్/రైస్ మిల్లు కొనుగోలు కేంద్రాల ఆల్ హమాలీ సంఘం సీఐటీయు అనుబంధం ఆధ్వర్యంలో మంగళవారం వనపర్తి బజార్ హమాలీ యూనియన్, తోపుడు బండ్ల హమాలీ యూనియన్ ల సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా తెలంగా ఆల్ హమాలీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుట్ట ఆంజనేయులు పాల్గొని మాట్లాడారు. ఏప్రిల్ 29న హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఛలో హైదరాబాద్‌కు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటులు చేయాలని, ప్రమాద భీమా సౌకర్యం రూ.10లక్షలు ఇవ్వాలని, భవన నిర్మాణ కార్మికుల వలె ప్రభుత్వమే గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రూ.6వేల పెన్షన్ ఇవ్వాలని, ప్రభుత్వ సంస్థల్లో పని చేస్తున్న సివిల్ సప్లై తదితర ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న, సివిల్ సప్లై తదితర ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న హమాలీలకు నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 29న సంక్షేమ బోర్డు సాధనకై ఛలో హైదరాబాద్ లేబర్ కమీషనర్ కార్యాలయం కు హమాలీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆల్ హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శాంతయ్య, గోవింద్, సూరి,బాలస్వామి, రాంచందర్, కురుమూర్తి, సీఐటీయు జిల్లా కమిటీ సభ్యులు నందిమల్ల రాములు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐటీయు జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు

## చెక్‌పోస్టు దగ్గర పోలీస్, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**నారాయణపేట ప్రతినిధి,ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలోకి వరిధాన్యం రాకుండా కర్ణాటక రాష్ట్రంలో త్వరలో శాసనసభ సాధారణ ఎన్నికల సందర్భంగా జిల్లాఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మంగళవారం ఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు కృష్ణ పోలీస్ స్టేషన్ పరిధిలో కృష్ణ బ్రిడ్జి దగ్గర బోర్డర్ చెక్‌పోస్టు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐ సీతయ్య చెక్‌పోస్టును తనిఖీ చేసి పోలీస్ అధికారులు, సిబ్బంది, రెవెన్యూ అధికారులు అందరు చెక్‌పోస్టు దగ్గర అప్రమత్తంగా ఉండాలని 24/7 విధులు నిర్వర్తిస్తూ వహనాలను తనిఖీ చేయాలని, వాటి వివరాలను రిజిస్టర్లు నమోదు చేయాలని, వాటి వివరాలను రిజిస్టర్లు నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కర్ణాటక నుండి వరిధాన్యం తెలంగాణ రాష్ట్రం నారాయణపేట జిల్లాకు రాకుండా చూడాలని, కర్ణాటక ఎన్నికల సందర్భంగా అక్రమంగా మద్యం, డబ్బు, చీరలు రవాణా జరక్కుండా చూడాలని తెలిపారు. చెక్‌పోస్టు దగ్గర పోలీస్ అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సిఐ సూచించారు. చెక్‌పోస్టు దగ్గర ఎస్సై విజయభాస్కర్, ఎఎస్సైలు, పోలీస్ సిబ్బంది, రెవెన్యూ అధికారులు ఉన్నారు.


చెక్‌పోస్టు వద్ద సిఐ, పోలీస్ సిబ్బంది

## మరికల్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

- స్వేరో సర్కిల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇబ్రహీంబాద్ లక్ష్మణ్

**మక్తల్,ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** మరికల్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని స్వేరో సర్కిల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇబ్రహీంబాద్ లక్ష్మణ్ అన్నారు. ఈసందర్భంగా మరికల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడుతూ, మరికల్‌లో ఒక బాలుర ఉన్నత పాఠశాల,ఒక బాలకల ఉన్నత పాఠశాల అలాగే పలు ప్రైవేట్ పాఠశాలలు ఉన్నప్పటికీ కళాశాల లేకపోవడం చాలా దురదృష్టకరమని, అంతేకాకుండా మరికల్ మండలానికి పలు గ్రామాల విద్యార్థులు వస్తుంటారు. ఇక్కడ ప్రభుత్వ కళాశాల లేకపోవడం వల్ల ప్రైవేట్ కళాశాలలో అనివార్యంగా చేరాల్సి వస్తుందని, ఈ విధంగా విద్యార్థులకు ఆర్థిక భారంపడి, కొంతమంది విద్యార్థులు తమ కుటుంబ ఆర్థిక నేపథ్యం దృష్ట్యా కళాశాల విద్యకు దూరమవుతున్న పరిస్థితి ఉందని కావున ప్రభుత్వం స్పందించి మరికల్‌లో తప్పనిసరిగా ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో చంద్రయ్య, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## పక్షవాతం వచ్చిన యువకుడికి మంత్రి రూ.50వేల ఆర్థిక సాయం

**పెద్దమందడి,ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** మండల పరిధిలోని అల్వాల గ్రామానికి చెందన హరిజన్ వెంకటయ్య అనే యువకుడు కొంతకాలంగా అనారోగ్యానికి గురై పక్షవాతం వచ్చి కాలు, చేయి పనిచేయడం లేదు, వెంకటయ్య మంచానికే పరిమితం కావడంతో వైద్యఖర్చులకు ఇబ్బందిగా ఉండడంతో గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మాజీ సింగిల్ విండో డైరెక్టర్ కుప్పిరెడ్డి లక్ష్మీకాంత్ రెడ్డి వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా తణక్షమే స్పందించిన మంత్రి మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని లక్ష్మీకృష్ణ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రతినిధుల సమావేశంలో బాదితుడు హరిజన్ వెంకటయ్యకు మంత్రి నిరంజన్‌రెడ్డి తన సోంతంగా రూ.50 వేలు అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి వెంకటయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సువర్ణ జగన్మోహన్‌రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, నాయకులు లక్ష్మీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


బాధితుడు వెంకటయ్యకు రూ.50వేల ఆర్థిక సహాయం అందజేస్తున్న మంత్రి

## టీజీసీజీటీఏ వనపర్తి జిల్లా కార్యవర్గం ఎన్నిక

**వనపర్తి టౌన్,ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** వనపర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ గెజిటెడ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నికలు సోమవారం నిర్వహించారు. వనపర్తి జిల్లా నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. వనపర్తి జిల్లా అధ్యక్షుడిగా డా.వెంకట ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా వంగూరు నాగరాజు యాదవ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన డా.జి.రాజేందర్ తెలిపారు. ఎన్నికైన అనంతరం ప్రమాణస్వీకారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రధాన ఆచార్యులు, వివిధ కళాశాలల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, సంఘ ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బలోపేతానికి నిర్విరామ కృషి చేస్తామని వారు తెలిపారు.



## సమ్మె నోటీసుపై మెమోరండం అందించిన పంచాయతీ కార్యదర్శులు


సీఐ రామకృష్ణకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ వివిధ రూపాల్లో ప్రభుత్వానికి గత కొన్ని రోజులుగా విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో ఈ నెల 28 నుంచి చేపట్టే సమ్మె నోటీసుపై పంచాయతీ కార్యదర్శులు మంగళవారం సీఐ రామకృష్ణ, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎస్ఐ శ్రీనివాస్‌లుకు మెమోరండం అందించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు ఫయాజ్, సురేందర్‌రెడ్డిలు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేపట్టేందుకు సిద్ధమవుతున్నామన్నారు.వినతి పత్రం అందజేసిన వారిలో పంచాయతీ కార్యదర్శులు అల్తాఫ్, ప్రదీప్, స్వప్న, నవనిత, మురహరి, రవీందర్, కృష్ణ, మంజుల, విష్ణు,శ్రీనివాస్,శ్రావణి, హరితరాణితో పాటు ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు ఉన్నారు.

## క్రీడాకారులను అభినందించిన సర్పంచ్

**వెల్దండ, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు మహారాష్ట్ర ముంబాయిలో జరిగినటువంటి మొదటి జాతీయ బాలుర, బాలికల రౌండ్ నెట్‌బాల్ చాంపియన్ షిప్ టోర్నీలో తెలంగాణ తరుపు నుంచి ఆడి ప్రతిభ సాధించిన విద్యార్థులతో పాటు కోచ్ చంద్రశేఖర్‌ను బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి అభినందించారు.యూ 19 డబుల్స్ విభాగంలో జంగిలి వంశీకృష్ణ కాంస్య పతకం,యూ19 సింగిల్స్ విభాగంలోక్యాసరపు లక్ష్మ ణ్ కాంస్య పతకాలు సాధించడంతో భూపతిరెడ్డి సన్మానించారు.రాబోవు రోజుల్లో క్రీడల్లో మరింతగా రాణించాలన్నారు.


క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

## వన నర్సరీలపై జాగ్రత్తలు తీసుకోవాలి

**వెల్దండ, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేప డుతున్న హరితహారంలో భాగంగా మొక్కలను నాటేందుకు వన నర్సరీల్లో పెంచుతున్న మొక్కలపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్య దర్శులకు ఎంపీడీఓ శ్రీనివాస్ సూచించారు. మండల పరిధిలోని తిమ్మినోనిపల్లి, కొత్త గ్రామాల్లోని వన నర్సరీలను ఎంపీడీఓ శ్రీనివాస్ పరిశీలించి పలు సూచనలు అందించారు. అనంతరం గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ కూలీ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలస్వామితో పాటు తదితరులు ఉన్నారు.


వన నర్సరీలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

## శుభ్రతను పాటించి, మలేరియా వ్యాధిని నివారించండి


మలేరియా డే నివారణ ర్యాలీని ప్రారంభిస్తున్న డా.వంశీకృష్ణ

**వీపనగండ్ల,ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి ప్రపంచ మలేరియా డే ర్యాలీని డా.వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలేరియా వ్యాధి వ్యాపించకుండా ఉండడానికి తగు జాగ్రత్తలు, సూచనలు చేశారు. ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని నీళ్ల నిల్వ లేకుండా, దోమలు ఉండకుండా చూడాలని, పరిశుభ్రతను పాటించాలని అప్పుడే మలేరియా వ్యాధిని నివారించవచ్చునని తెలిపారు. మలేరియా వ్యాధి లక్షణాలు ఉన్నచోఆసుపత్రికి వచ్చి పరీక్షించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.రాజశేఖర్, ఆరోగ్య కార్యకర్తలు రామచంద్రమ్మ, రాములు, జహంగీర్, ఆశవర్కర్లు, పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన రైతు సంఘం జిల్లా కార్యదర్శి


రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి పరమేశ్వరచారి

**వనపర్తి టౌన్,ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** వనపర్తి మండల పరిధిలోని రాజపేట దగ్గర ఏర్పాటు చేసిన రాజనగరం సింగిల్‌విండో వరి కొనుగోలు కేంద్రాన్ని వనపర్తి జిల్లా రైతు సంఘం కార్యదర్శి పరమేశ్వర చారి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సుమారు కొనుగోలు కేంద్రాలకు వారం పది రోజుల నుంచి వడ్లు తీసుకువచ్చి కొనుగోలు కేంద్రం దగ్గర ఆరబోసి వడ్ల తేమశాతం వచ్చిన వడ్లను నేటి వరకు 4వేల బ్యాగులు కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. ఇంకా ఇక్కడ వడ్లు చాలా ఉన్నాయి కాబట్టి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనందున రైతుల దగ్గర నుంచి తొందరగా కొనుగోలు చేయాలని రాజనగరం సింగిల్ విండో ఛైర్మెన్ రఘువర్ధన్ రెడ్డి ని ఫోన్ లో సంప్రదించగా ఆయన సానుకూలంగా స్పందించి రేపటి నుంచి హమాలీలను ఎక్కువగా పెట్టికొనుగోలు చేస్తామని చెప్పినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు శంకర్ నాయక్,సూర్యనాయక్, జన్యా నాయక్, లక్ష్మీ, శాంతమ్మ, సాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పాలమూరుకు తరలివెళ్లిన బీజేపీ శ్రేణులు

**అమరచింత,ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో పాలమూరులో జరిగే నిరుద్యోగ సభకు మంగళవారం అమరచింత పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పాలమూరు కు తరలివెళ్లారు. ఈసందర్భంగా బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు క్యామ భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఉద్యోగాలు వస్తాయని ఆశలు పెట్టుకున్న నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ల పేరుతో కాలయాపన చేస్తుందని తక్షణమే ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ పాలమూరులో జరిగే నిరుద్యోగ సభకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హాజరవుతారని తెలిపారు. తరలివెళ్లిన వారిలో బీజేపీ నాయకులు పి.సురేష్, నరాలసిద్దు రాములు,పి.రాకేష్, కృష్ణమూర్తి, నరసింహ, వెంకటేష్, హనుమంతు, రవి తదితరులు ఉన్నారు.



## నేడు బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల మహాసభ

● బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జెట్టి నరసింహ్మారెడ్డి



**దేవరకద్ర,ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** దేవరకద్రలో మంగళవారం దేవరకద్ర నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు జెట్టి నరసింహ్మారెడ్డి సోమవారం తెలిపారు.స్థానిక శ్రీనివాస గార్డెన్‌లో ఉదయం 10.30లకు జరిగే ఈ మహాసభకు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.భారత రాష్ట్ర సమితి పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్,మంత్రి కే.తారకరామారావు ఆదేశాల మేరకు ఈ మహాసభ నిర్వహిసున్నామన్నారు.ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరయ్యే వారికి భోజనాల సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామన్నారు.కావున ఈ కార్యక్రమానికి నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులు అధికసంఖ్యలోపాల్గొని విజయవంత చేయాలని జెట్టి నరసింహ్మారెడ్డి కోరారు.

## విడియో కాన్ఫరెన్స్ ద్వారా నెలవారి సమీక్ష



విడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సిఐ, పోలీస్ సిబ్బంది

**మక్తల్,ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్పీలకు సోమవారం విడియో కాన్ఫరెన్స్ ద్వారా నెలవారి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకై పోలీస్ శాఖ చేసే కృషి ఆయా ప్రాంతాల అభివృద్ధికి కారణమవుతుందని డిజిపి అన్నారు. రాష్ట్రంలో ప్రతి పోలీస్ స్టేషన్ లోని అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో పనిచేయడం వలన నేరాల నిరోధన,నేర పరిశోధన, న్యాయస్థానంలో శిక్షల ఖరారుతోపాటు పోలీస్ కార్యాలయాలు ఆధునీకకరణ పూర్తి చేయగలిగామన్నారు. వర్టికల్స్ వాటి పనితీరు, హెచ్‌ఆర్ఎంఎస్ వినియోగం,నేరాల వివరాలను ఆన్‌లైన్ నమోదు, పెండింగ్ కేసులు మొదలగు విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. కర్ణాటక, ఎలక్షన్స్ సందర్భంగా బార్డర్ పోలీస్ పరిధిలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని, ఆకస్మికంగా వాహనాల తనిఖీలు నిర్వహించాలని బార్డర్ ఏరియాలో జరిగే వ్యాపారులపై నిఘా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలోజిల్లా ఎస్పీఎన్.వెంకటేశ్వర్లు పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ కేసులను కోర్టు అధికారుల సమన్వయంతో పెండింగ్ కేసులు పూర్తి చేయడానికి నిత్యం కృషి చేస్తున్నామని తెలిపారు.జిల్లాలో పోలీసు అధికారులకు,సిబ్బందికి నిరంతరం ట్రైనింగ్స్, వర్క్‌షాప్స్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు షీటీమ్స్,పోలీస్ కళాబృందం ద్వారాసైబర్ నేరాలు, పోలీస్ చట్టాలు, ట్రాఫిక్ రూల్స్,మూడనమ్మకాలు, బాల్య వివాహలు, సిఇఐఆర్ నూతన అప్లికేషన్ మొదలగు విషయాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కర్ణాటక ఎన్నికల సందర్భంగా నారాయణపేట జిల్లా బార్డర్ పోలీస్ పరిధిలో 4 చెక్ పోస్టులను రేపటి నుండి ఏర్పాటు చేయడం జరుగుతుందని ప్రతిరోజు వాహనాల రాకపోకలపై తనిఖీలు చేస్తూ గట్టి నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.కార్యక్రమంలో సిఐటిలు రవిబాబు, సీతయ్య, శ్రీకాంత్‌రెడ్డి,రామ్‌లాల్, ఆర్ఐకృష్ణయ్య, డిపిఓసూపరింటెండెంట్ శంకర్ లాల్,ఎస్సైలునవీన్, సునిత, సుధమాధురి, డిపిఓ,డిసిఆర్‌బి, ఎస్బీ,ఐటికోర్ స్టాఫ్ మొదలగు వారు పాల్గొన్నారు.

## విద్యార్థి ఆమనికి కలెక్టర్ అభినందన



**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 24,ప్రభాతవార్త:** డా బీఆర్ అంబేద్కర్ జయంతి, 125 అడుగులు భారీ విగ్రహావిష్కరణ సందర్భంగా ఈ నెల 14న హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన ఆమనిని కలెక్టర్ రవినాయక్ అభినందించారు. ఈమేరకు సోమవారం నూతన కలెక్టరేట్‌లో జడ్చర్ల ఎస్సీ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న ఆమని రాష్ట్ర స్థాయి వ్యాసరచనలో మూడో స్థానంలో నిలిచి ల్యాప్‌టాప్ సాధించడంపై కలెక్టర్ అభినందించి సత్కరించారు. అదేవిధంగా పోస్ట్‌మెట్రిక్ విభాగంలో విష్ణు అనే విద్యార్థి మొదటి స్థానంలో నిలిచి ల్యాప్‌టాప్ గెలుచుకోవడం తెలిసిందే.

## వార్డు సభ్యులు విష్ణువర్థన్‌రావును పరామర్శించిన సంజీవ్‌యాదవ్

**వెల్దండ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని కొట్ర గ్రామానికి చెందిన వార్డు సభ్యులు విష్ణువర్థన్‌రావు గత కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. సోమవారం బీఆర్ఎస్ నాయకులు సంజీవ్‌కుమార్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవాలని, ఆసుపత్రికి వెళ్లడానికి వాహనంతో పాటు మెడికల్ ఖర్చులను భరిస్తానని హామీ ఇచ్చారు.

## 26న నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేద్దాం

**వెల్దండ, ఏప్రిల్24 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలో ఈ నెల 26న ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేద్దామని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు మల్లేష్ ముదిరాజ్ అన్నారు. మండల పరిధిలోని తిమ్మినోనిపల్లి, కొట్ర, రాచూర్, కుప్పగండ్ల గ్రామాల్లోని ముదిరాజ్‌లను కలిసి మహాసభ కరపత్రాలను ఆవిష్కరించి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కృష్ణ ముదిరాజ్, నర్సింహ్మ ముదిరాజ్, వెంకటేష్ ముదిరాజ్, ఎర్ర శ్రీను, శ్రీశైలం ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం

**గద్వాల ప్రతినిధి,ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** గద్వాల పట్టణంలో సుంకులం మెట్టుకు చెందిన బోయ ఆంజనేయులు మరణించారు. వారి అంత్యక్రియలకు భారతీయ జనతా పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ ద్వారా మాజీ మున్సిపల్ ఛైర్మన్, గద్వాల అసెంబ్లీ కన్వీనర్ కృష్ణవేణి రామాంజనేయులు, కౌన్సిలర్‌శ్రీరాములు అంత్యక్రియలకు రూ.10వేలు ఆర్థిక సహాయం చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓబిసి అధికార ప్రతినిధి నాగేందర్ యాదవ్,బిజెవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెమలికంటి రామాంజనేయులు పాల్గొన్నారు.

## కంటి వెలుగు ప్రారంభం

**ఉట్కూర్,ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** ఉట్కూర్ పరిధిలోని కొల్లూరు ,నాగిరెడ్డి పల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉట్కూర్ మండల ఎంపిపి ఎల్కోటి లక్ష్మినారాయణరెడ్డి, జడ్పీటిసి అశోక్‌గౌడ్, వైద్యాధికారి డా. భవాని, నాగిరెడ్డి పల్లి సర్పంచ్‌స్వాతి గోవిందు ప్రారంభించారు.ఆరోగ్య విస్తరణ అధికారి విజయ్‌కుమార్, పర్యవేక్షకులుమణిమాల, ఆరోగ్య కార్యకర్తలు మహేశ్వరి, కవిత,ఆశాకార్యకర్తలు, ఆప్తోమెట్రిస్ట్ జనార్ధన్, డిఇఓ కిరణ్‌బేడీ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల పటిష్టతకు కృషి

**ఉట్కూర్,ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కొత్తపల్లిలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యార్థుల ప్రగతి పత్రాలు అందజేసి విద్యార్థుల ప్రగతి వివరాలను వారి తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్, ఉపధ్యాయురాలు శ్వేత, సర్పంచ్ శాంతమ్మ, ఛైర్మన్ చిన్న నర్సింలు, ఉపసర్పంచ్ అంజమ్మ, శేఖర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# తుది దశలోని పనుల ప్రారంభానికి సిద్ధం చేయాలి

● మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ జి.రవినాయక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్ట డం జరిగిందని, అందులో చాలావరకు చివరి దశలో ఉన్నాయని, అలాంటి వాటిని వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం సమీకృత జిల్లా అధి కారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశం మందిరంలో నిర్వహించిన జిల్లా అధికారుల సమ్మిళిత సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యంగా మహబూబ్‌నగర్ పట్టణంలో శిల్పారామం, వైకుంఠధామాలు, కూడళ్ల అభివృద్ధి తదితర ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని వీటన్నింటిని సంబంధిత శాఖల అధికా రులు ముఖ్యంగా ఇంజనీరింగ్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని, అవస రమైన చోట ఎక్కువ మంది కూలీలను, యంత్రాలను వినియోగించి పనులు పూర్తి చేయాలని చెప్పారు. పనుల పూర్తి సంబంధిత ఇంజనీర్లపై ఉందని అన్నారు.అదేవిధంగా పనులను నిర్వహిస్తున్న సంబంధిత కాంట్రాక్టు ఏజెన్సీలు సైతం ఈ విషయంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి త్వరితగతిన పనులు పూర్తి చేసేలా సహకరించాలని కోరారు. వారం రోజుల్లో వీటన్నింటిని ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని చెప్పారు. శిల్పారామం, వైకుంఠ ధామం, పట్టణంలోని అన్ని కూడళ్లలో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభానికి సంసిద్ధం చేయాల్సిందిగా ఆయన పునరుద్ఘాటించారు.ఇకపై బుధవారం ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా వారి మండలాలను సందర్శించిప్రభుత్వ పథకాలను పర్యవేక్షించాలని అన్నారు. ఇటీవలకురిసిన వర్షాలకు జిల్లాలో దెబ్బతిన్న పంటల వివరాలపై వ్యవసాయ శాఖఅధికారులు, వ్యవసాయవిస్తరణ అధికారులు వెంటనే రైతుల వారిగా వివరాలు సమర్పించాల్సిందిగా ఆదేశించారు. సమావే శంలో రెండవ విడత గొర్రెలపంపిణీ, కంటి వెలుగు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, జిల్లా అధికారులు ఉన్నారు.

*ప్రజా సమస్యల పరిష్కారానికి.. బాధితులకు అండగా ఉంటూ*

# ఫిర్యాదులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

● గద్వాల జిల్లా ఎస్పీ కె.సృజన



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

**గద్వాల ప్రతినిధి,ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదులపై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ కె. సృజన అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వివిధ సమస్యలపై బాధితుల నుండి వచ్చిన 10 అర్జీలను జిల్లా ఎస్పీ స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రజావాణిలో బాధితుల నుండి వచ్చిన ఫిర్యాదులపై ఆయా పోలీస్ స్టేషన్‌ల అధికారులతో మాటాడుతూ పోలీస్ పరిధిలోని ప్రతి అంశాన్ని చట్ట పరిధిలో పరిష్కరించడంలో బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. బాధితులకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని భరోసా కల్పించారు. అలాగే చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తూ, శాంతిభద్రతల పరిస్థితులకు భంగం కలిగించే వారి పట్ల మహిళలకు వ్యతిరేకంగా జరిగే నేరాల పట్ల కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. బాధితులకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని భరోసా కల్పించారు. అలాగే చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తూ, శాంతి భద్రతల పరిస్థితులకు భంగం కలిగించే వారి పట్ల, మహిళలకు వ్యతిరేకంగా జరిగే నేరాల పట్ల కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. సోమవారం వచ్చిన ఫిర్యాదులలో భర్త వేదింపులకు సంబంధించి1, భూ వివాదాలకు సంబంధించి 6,చీటింగ్‌కు సంబంధించి 2 ఫిర్యాదులు, ఇతర అంశాలకు సంబంధించి 1 ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు.

## సిఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసిన మొబైల్ ఫోన్‌లు బాధితులకు అప్పగించిన జిల్లా ఎస్పీ



సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారికి అందజేస్తున్న పోలీసులు

**గద్వాల ప్రతినిధి,ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** రెండు రోజుల క్రితం కెటిదొడ్డి, అయిజ, ఇటిక్యాల, గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 10 మంది వివిధ కారణాల వల్ల తమ మొబైల్ ఫోన్‌లను పోగొట్టుకోగా ఆ విషయంలో వారి ఆధార్‌కార్డులను, సంబంధిత మొబైల్ ఫోన్ల ఐఎంఈఐ నంబర్లను,మీసేవా కేంద్రాలలో పొందినదరఖాస్తులను, పోలీస్ స్టేషన్‌లో అందించగా వాటిని పోలీస్ అధికారులు సిఇఐఆర్ పోర్టల్ ద్వారా అప్‌లోడ్ చేసి వారి మొబైల్ ఫోన్లను బ్లాక్ చేసి ట్రిస్ట్ డీటైల్స్‌లోకి వెళ్లి వారి మొబైల్స్‌లలో సిమ్‌కార్డు వేసిన వారి వివరాలు తెలుసుకుని వారి నుండి మొబైల్స్‌ను రికవరీ చేశారు. ఆ సెల్‌ఫోన్లను సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ కె. సృజన చేతుల మీదుగా బాధి తులకు అప్పగించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఎవరైనా తమ సెల్‌ఫోన్ పోగొట్టుకున్నట్లయితే వారు సిఇఐఆర్ పోర్టల్ ద్వారా వెళ్లి పూర్తి వివరాలు పొందుపర్చాలని, అలా చేసినట్లయితే త్వరగా వారి మొబైల్స్‌లను పట్టుకోవడం జరుగుతుందని, కావున ప్రజలు సిఇఐఆర్ అప్లికేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డిసిఆర్బీ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్,సైబర్ సెల్ ఎస్సై రజిత పాల్గొన్నారు.

## నేటి బీఆర్ఎస్ పార్టీ ప్లీనరి సమావేశాన్ని విజయవంతం చేద్దాం!



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**వెల్దండ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** బీఆర్ఎస్ పార్టీ ప్లీనరి ప్రతినిధుల నేటి సమావేశాన్ని విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. వెల్దండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడి నియోజకవర్గ పీన్లరి ప్రతినిధుల మహాసభ ఆమనగల్లు పట్టణంలోని శ్రీ లక్ష్మిగార్డెన్‌లో ఉదయం కల్వకుర్తి నియోజకవర్గంలోని 164 గ్రామ పంచాయతీలు, 37 మున్సిపాలిటి వార్డుల్లో బీఆర్ఎస్ పార్టీ జెండాలను ఆవిష్కరించి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటిల నుంచి 4వేల మందిని ఆమనగల్లు ప్లీనరికి ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఉదయం ప్రతి గ్రామ పంచాయతీలోని వాడల్లో 9గంటలకు బీఆర్ఎస్ పార్టీ జెండావిష్కరణ చేయాలని, ప్లీనరిలో నియోజకవర్గానికి కావాల్సిన తీర్మానాలను ప్రవేశ పెడుతున్నామని, అందులో భాగంగా పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా, శ్రీశైలం ప్రాజెక్టు నుంచి మనకు రావాల్సిన నీటి వాటా, మార్చాల నుంచి వయా గద్వాల,కల్వకుర్తికి రైల్వేలైన్, శ్రీశైలంకు రైల్వే లైన్, అగ్రో ఇండస్ట్రీయస్, గిరిజన యూనివర్సిటీ, జిల్లాకో మెడికల్ కళాశాలపై తీర్మానాలను ప్రవేశ పెడుతున్నామన్నారు. ప్లీనరికి పార్టీ ప్రజా ప్రతినిధులు, పార్టీ అనుబంధ సంఘాల బాధ్యులు ప్లీనరి సమావేశానికి హజరై విజయవంతం చేయాలన్నారు.కార్యక్రమంలో జైపాల్‌నాయక్, గోపాల్‌నాయక్, దార్ల కుమార్, ఇస్లావత్‌కుమార్, గజిని శ్రీను, కాదూరాం, దేవేందర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## బీఆర్ఎస్ ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేయాలి

నేడు గ్రామ గ్రామన గులాబీ జెండా ఎగురవేయాలి : అలంపూర్ ఎమ్మెల్యే డా.వి.ఎం.అబ్రహం



**ఉండవెల్లి,ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ధ్యేయంగా ముఖ్య మంత్రి కేసీఆర్ 2001 ఏప్రిల్ 27న బీఆర్ఎస్ పార్టీని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మనందరం ఘనంగా నిర్వహించుకోవాలని, పార్టీ అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశానుసారం ఈనెల 25న అలంపూర్ చౌరస్తాలోని మార్కెట్ యార్డ్‌లో నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేయాలని అలంపూర్ ఎమ్మెల్యే డా.వి.ఎం.అబ్రహం పిలుపునిచ్చారు. సోమవారం అలంపూర్ చౌరస్తాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూఈనెల 25న నియోజవర్గ వ్యాప్తంగా ఉదయం 8గంటలకు గ్రామ గ్రామాన గులాబీ జెండా ఎగురవేయాలని ఆయన కోరారు. ప్రతి గ్రామంలో గులాబీ జెండీ ఎగురవేసిన వెంటనే అలంపూర్ చౌరస్తాలో ఉదయం 10గంటలకు ఏర్పాటు చేసిన ప్లీనరీ సమావేశానికి ప్రతి గ్రామం నుండి 25మంది నుంచి 30మంది పార్టీ ముఖ్య నాయకులు హాజరుకావాలని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ ఆధ్వర్యంలో సాధించిన రాష్ట్రాభివృద్ధి, ప్రజల కు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమకార్యక్రమాలు,పార్టీ తరుపున చేపట్టిన కార్యక్రమాలన్నింటినీ విస్తృతంగా చర్చించడం జరుగుతుందని అన్నారు. కావునబీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు,ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొనాలని ఆయన తెలిపారు.

# వేసవి సెలవులను విద్యార్థులు వృథా చేయొద్దు



మాట్లాడుతున్న పాఠశాల హెచ్ఎం

**ఉట్కూర్,ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** ఎంపియుపిఎస్ నిడుగుర్తి పాఠశాలలో నిర్వహించిన పేరెంట్ టీచర్స్ మీటింగ్ (పిటిఎం)లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. సర్పంచ్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎంసి ఛైర్మన్లు హాజరైన కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలను మన ఊరు మనబడి కార్యక్రమం ద్వారా ఉన్నతంగా తీర్చిదిద్దడం జరిగింది. ఎఫ్ఎల్ఎన్ తొలిమెట్టు ద్వారా విద్యార్థులలో కావాల్సిన సామర్థ్యాల సాధన కోసం ఉపాధ్యాయుల బృందం అంత శక్తివంచన లేకుండా కృషి చేయడం జరిగింది. తత్ఫలితంగా విద్యార్థుల గ్రేడులో మెరుగైన ఫలితం సాధించడం జరిగిందన్నారు.విద్యార్థులకు ఉత్తీర్ణత పత్రాలు అందించడం జరిగింది. వేసవి సెలవులను వృథా చేసుకోకుండా కొత్త విషయాలు నేర్చుకునే విధంగా ప్రోత్సహించాలని, రోజుకు కొంత సమయం అయినా అభ్యాసం కొనసాగేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులులక్ష్మారెడ్డి, సర్పంచ్ యశోదమ్మ, పాఠశాల ఛైర్మన్లు నర్సింహులు, మక్బూల్ ఖాన్, ఉపాధ్యాయులు పద్మ, సునిత, వెంకటప్ప, సుజాత, సలాం, లియాఖత్, శ్రీనివాస్, ఆంజనేయులు పాల్గొన్నారు.

# ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



**నారాయణపేట ప్రతినిధి,ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** మండలంలోని గార్లపల్లి గ్రామంలో పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాల గురించి, అంటరానితనం, మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు, షీ టీమ్స్, ట్రాఫిక్ చట్టాలు, సిసి కెమెరాలపై మాటలు, పాటల రూపంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై పర్వతాలు మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరగాళ్ల చూసే మోసపూరిత ఆశలకు గురి కాకుండా తస్మాత్ జాగ్రత్త పడాలని తెలిపారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930లో ఫ్రీ నంబర్‌కు లేదా డయల్ 100కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. దొంగతనాల నిర్మూలన గురించి గ్రామాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల దొంగతనాలు చేయడానికి భయపడతారని అలాగే గ్రామాలలో అసంఘటిత కార్యక్రమాలు నివారించడానికి అవకాశం ఉంటుందని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు కళాబృందం, సభ్యులు సురెందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, కళ్యాణి, రుక్యనాయక్ మొదలగు వారు పాల్గొన్నారు.

## నేడు పీయూలో మెగా జాబ్ మేళా

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 24,ప్రభాతవార్త:** పాలమూరు విశ్వ విద్యాలయంలో మంగళవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21కి పైగా కంపెనీలు ఉద్యోగావకాశాలు కల్పించనున్నాయని, డిగ్రీ, పీజీ చదివిన వారు అర్హులని, వారి వారి విద్యార్హత ఆధారంగా ఉద్యోగాలు లభిస్తాయన్నారు. సంవత్సరానికి లక్షన్నర నుంచి రూ.6లక్షల వరకు ప్యాకేజీలతో హైదరాబాద్‌లో పని చేసేందుకు ఆసక్తి కలిగిన వారు హాజరుకావాలన్నారు. 1200కు పైగా ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని వెల్లడించారు. ఈమేరకు జాబ్ మేళాను ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నట్లు వీసీ తెలిపారు. ఇంగ్లీష్‌లో ప్రావీణ్యం, మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్న వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## వస్తువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు

● జిల్లా తూనికల కొలతల శాఖ అధికారి సత్యనారాయణ

**వనపర్తి టౌన్,ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** వస్తువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా తూనికల కొలతల శాఖ అధికారి సత్యనారాయణ హెచ్చరించారు. పలు ఫిర్యాదులపై వనపర్తి జిల్లా వ్యాప్తంగా సోమవారం దాడులు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని యుకో బ్యాంకు లో వేయింగ్ మిషన్ గడువు తీరిన కూడా రెన్యువల్ చేసుకోకుండా అలాగే వినియోగస్తున్నందున ఆకస్మి తనిఖీ నిర్వహించి ఆ బ్యాంకు కు రూ.10వేల పెనాల్టీ విధించామని ఆయన తెలిపారు. మర్రికుంటలోని ఓ హోటల్‌లో అధిక ధరలకు వాటర్ బాటిల్లు విక్రయిస్తున్నారని తెలిసి ఆకస్మికంగా తనిఖీ చేయగాఅధిక దరలకు విక్రయిస్తున్నారని మా దష్టికి వచ్చి రూ.5వేల పెనాల్టి విధించామని తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారస్తులు ఎవరైనా ఎంఆర్‌పీఎస్‌కన్నా ఎక్కువధరలకు వస్తువులు విక్ర యించినట్లయితే తెలియజేయాలనిఆయన తెలిపారు. వినియోగదారులు ఎలక్ట్రిక్ కాంటాలను, బాట్లను తప్పనిసరిగా సరిచూసుకోవాలని ఆయన సూచించారు వ్యాపారస్తులు ఖచ్చితంగాముద్రలు వేసిన ఎలక్ట్రానిక్ కాంటాలను బాట్లు మాత్రమే వాడాలని లేనిచో కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించాకు.

## మంత్రి నిరంజన్‌రెడ్డికి ఘన సన్మానం



**ఇటిక్యాల,ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామ పంచాయతీని కొత్త ఎర్రవల్లి మండలం ఏర్పాటుకు సహకరించినందుకు సోమవారం కొత్త మండలంలోని నాయకులు వనపర్తిలోని మంత్రి నివాసంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిని కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సన్మానించారు. మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తా గ్రామ పంచాయతీని కొత్త ఎర్రవల్లి మండలంగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ వారం రోజుల క్రితం జారీ చేసింది. అన్ని వనరులు, వసతులు ఉన్న ఎర్రవల్లి గ్రామ పంచాయతీని మండలంగా ఏర్పాటు చేయాలని గత ఏడాది జులై నెలలో 14 గ్రామాల ప్రజా ప్రతినిధులు, ప్రజలు, యువకులు అచలపక్షంగా ఏర్పడి పాదయాత్ర రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్‌రెడ్డికి వినతి పత్రం కూడా సమర్పించారు. అందుకు మండల ఏర్పాటుకు సహకరించినందుకు సోమవారం వనపర్తిలోని మంత్రి నివాసంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నివాసంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిని కలిసి ఆయనను ఘనంగా సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన వారిలో సింగిల్ విండో ఛైర్మన్ రంగారెడ్డి, షేక్‌పల్లి సర్పంచ్ రవిందర్‌రెడ్డి, ఆంజనేయులు సాగర్, నాయకులు రాగన్న, పెద్దలక్ష్మన్న,రామన్న, లోకారెడ్డి, కృష్ణసాగర్, సుధాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి,లోకారెడ్డి తదితర గ్రామాల నాయకులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి పోతురాజు శంకరమ్మ సేవాదళం ఆర్థిక సాయం



**ఇటిక్యాల,ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామా నికి చెందిన కర్రె బీసన్న సోమవారం ఉదయం అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న కొండేరు గ్రామానికి చెందిన పోతురాజు శంకరమ్మ సేవాదళం సభ్యులు వారి ఇంటికి వెళ్లి భౌతికకాయాన్ని సందర్శించి పూల మాల వేసినివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా విదేశాలలో స్థిరపడిన పోతురాజు సోమనాద్రి సూచన మేరకు బాధిత కుటుంబం నిరుపేద కుటుంబం కావడంతో 5 వేల రూపాయలను ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు.కార్యక్రమంలో పోతురాజు శంకరమ్మ సేవాదళం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**మక్తల్,ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో స్థానిక పిఎసిఎస్ కార్యాలయం దగ్గర వరి కొనుగోలు కేంద్రాన్ని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన వరి ధాన్యాన్ని దళారులను నమ్మకుండా నేరుగా ప్రభుత్వమే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తుందని రైతులంతా ఈ వరి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## ఒంటికాలుతో నిరసన తెలిపిన వీఓఎలు

**వెల్దండ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** వీఓఎల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని చేపడుతున్న రీలే నిరాహర దీక్ష 8వ రోజుకు చేరుకుంది. వెల్దండ మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌ఆవరణలోచేపడుతున్న వీఓఎలు చేపడుతున్న నిరాహర దీక్షలో వీఓఎలు ఒంటికాలుతో నిరసన తెలిపారు. వీఓఎల జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ వీఓఎలు కనీస వేతనంతో పాటు ఉద్యోగ భద్రత,ఆరోగ్య భీమా చెల్లించాలనిడిమాండ్ చేశారు. మహిళా సంఘాల అభివృద్ధిలో వీఓఎల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. కార్యక్రమంలో వీఓఎల మండల అధ్యక్షురాలు జంగమ్మ, వసంత, జ్యోతి, అల్లాజీ, రవి, జహేదా,సాయిప్రసన్న, మంజుల, పద్మ, స్వప్న, నందు, జ్యోతి ఉన్నారు.